పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 27 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గత నెలలో జరిగిన కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసులు, కోర్టు విధులు, శిక్షల అమలు, క్వాలిటీ ఆఫ్ ఇన్విస్టిగేషన్, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్, పోలీస్ పని విభాగాలు, డయల్ 100 ఫిర్యాదులు, సిబ్బంది స్పందన, పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, రిసిప్షన్ నిర్వహణ వంటి అంశాలపై సిబ్బందితో చర్చించి సూచనలు చేశారు. సామాజిక అంశాలు, గంజాయి వల్ల అనర్థాలు, సైబర్ మోసాల నుంచి రక్షణ పొందడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. రాబోవు ఎన్నికల నిర్వహనకు సిబ్బంది సిద్ధం కావాలని, ఎన్నికల బందోబస్తుకు ముందు నుంచే ప్రణాళిక చేసుకోవాలన్నారు. వివిధ కేసుల్లో జీవిత ఖైదు పడేలా పని చేసిన కోర్టు కానిస్టేబుళ్లకు, భరోసా సెంటర్ సిబ్బందికి డీజీపీ కార్యాలయం, మహిళా రక్షణ విభాగం అందించిన ప్రశంసా పత్రాలను ఎస్పీ భరోసా సెంటర్ మహిళ ఎస్ఐ మౌనిక, ఏఎస్ఐ సైదాబి, నేరేడుచర్ల కోర్టు కానిస్టేబుల్ లింగయ్య, మోతె కానిస్టేబుల్ రవీందర్‌కు ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్ మీనా, డీఎస్పీలు రవి, శ్రీధర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్, శివ కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, సీఐలు రాజశేఖర్, రాము, రజితారెడ్డి, సురేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీను, రఘువీర్‌రెడ్డి, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు, ఐటీ కోర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, ఫిబ్రవరి 27 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కావునా విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల్లో చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలన చేసుకోవాలని చెప్పారు. మైక్రో అబ్జర్వర్లు జిల్లాకు వచ్చే జనరల్ అబ్జర్వర్ల ఆధ్వర్యంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌కి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం బాపూజీ, రాజు, ట్రైనర్స్ రమేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక విప్లవం రావాలి

రైతులు సాగులో సాంకేతికత జోడించి తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో అర్వపల్లి మండలం కొమ్మల గ్రామానికి చెందిన కుంటిగొర్ల నాగరాజు కొనుగోలు చేసిన అగ్రి డ్రోన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు సాంకేతికతను ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేలా పంటలను సాగు చేయాలన్నారు. పంటల సాగులో అగ్రి డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఖర్చు సైతం తగ్గిస్తుందని తెలిపారు.
కార్యక్రమంలో ఎల్‌డీఎం బాపూజీ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ జ్యోతి, నరసింహారావు పాల్గొన్నారు.

హైకోర్టు ప్రభుత్వ ఏజీపీగా సోము శ్రీనివాస్‌రెడ్డి

సోము శ్రీనివాస్‌రెడ్డి

పాలకవీడు, ఫిబ్రవరి 27 : హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా (ఏజీపీ)గా మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సోము శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ న్యాయ శాఖ కార్యదర్శి తిరుపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన సోము కనకారెడ్డి, గోవిందమ్మ చిన్న కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి. 2011లో న్యాయవిద్య పూర్తిచేసి 2012లో తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేయించుకున్నారు. హైకోర్టులో గత 12 ఏండ్లుగా న్యాయవాదిగా పని చేస్తున్నారు. న్యాయవాదిగా పని చేస్తూనే తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. రంగారెడ్డి జిల్లాలో న్యాయవాద సంఘు కార్యనిర్వాహక సభ్యుడిగా సేవలందించారు. శ్రీనివాస్ రెడ్డి ఏజీపీగా నియామకం కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 27 : లైంగిక వేధింపుల నివారణ చట్టంపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పని ప్రదేశంలో లైంగిక వేదింపుల చట్టంపై మెప్మా ఆర్పీలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు తాము పని చేస్తున్న చోట ఎవరైనా లైంగిక వేదింపులకు గురిచేస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ మిషన్ కో-ఆర్డినేటర్ చైతన్య, టీఎంసీ శ్వేత, జనరల్ స్పెషలిస్టులు రేవతి, వినోద్ పాల్గొన్నారు.

దివ్యాంగుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 27 : మేళ్లచెర్వు మండల కేంద్రంలో దివ్యాంగుడిని ప్రియుడితో కలిసి భార్య హత మార్చిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నేర్నకంటి వీరగోపయ్య ఈ నెల 25వ తేదీ రాత్రి ఫంక్షన్ వెళ్లి వచ్చి ఇంట్లో నిద్రించగా తెల్లావారేసరికి మృతిచెందాడు. అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా మృతదేహం మీద గాయాలు కనిపించడంతో బంధువులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివాహేతర సంబంధం వల్లే వీరగోపయ్యను చంపారని బంధువులు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి భార్య వీరకుమారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. మండల కేంద్రానికి చెందిన షేక్.సైదా హుస్సేన్‌తో కొంతకాలంగా ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసి వీరగోపయ్య భార్యను మందలించాడు. దాంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని భావించి ఆదివారం రాత్రి ప్రియుడికి ఫోన్ చేసి పిలిపించి ఇద్దరు కలిసి దిండుతో ఊపిరాడకుండా చేసి చంపినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, మేళ్లచెర్వు ఎస్ఐ పరమేశ్‌తో పాటు సిబ్బంది నాగేశ్వర్ రావు, గోపయ్య, శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలి

- ఎంపీపీ జ్యోతిభిక్షం

నేరేడుచర్ల : మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతిభిక్షం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 27 : సాగర్ నీటిని తక్షణమే విడుదల చేసి సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ లకుమళ్ల జ్యోతిభిక్షం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పెంచికల్‌దిన్నె ఎంపీటీసీ ఎల్లబోయిన లింగయ్య ప్రజలను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సభలో ప్రతిపాదన పెట్టగా కల్లూరు గ్రామ ఎంపీటీసీ నాగవేణి బలపరిచారు. దాంతో సభ మొత్తం ఏకగ్రీవంగా సాగర్ నీటిని విడుదల చేయాలని తీర్మానం చేసింది. అంతకముందు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కొత్తలైన్లు వేసినట్లు తెలిపారు. వైద్యాధికారి నాగిణి మాట్లాడుతూ మార్చి-3న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున పాలకవీడు, నేరేడుచర్ల ఉమ్మడి మండలంలో 120 మంది సిబ్బందిని నియమించి 30 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను నివారించడం కోసం మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా నీటిని ఉదయం, సాయంత్రం సమయంలో ఒక గంట సేపు విడుదుల చేస్తున్నట్లు వివరించారు. మిషన్ భగీరథ ఈఈ శ్రీనాథ్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 53 ట్యాంకులు ఉండగా ముసొడ్డి తండా ట్యాంక్ మినహా ఇతర ట్యాంకులకు మొత్తం నీరు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామ ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీఓ విజయ కుమారి పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడాలి : సీపీఎం

సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక అరిబండి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో బోర్లు, బావుల కింద సుమారు 1.50 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్లు తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతన్నల బాధను అర్థం చేసుకుని సాగర్ ఎడమ కాల్వకు 15 రోజుల పాటు నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేశ్, కందగట్ల అనంత ప్రకాశ్, ఎడ్ల సైదులు, కుంకు తిరపతయ్య, మొగిలిచర్ల రుద్రమ్మ, నీలా రాంమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

చిలుకూరు : సాగర్ నీటిని తక్షణమే విడుదల చేసి వరి పొలాలను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ముర్తాల వెంకట్‌రెడ్డి అన్నారు. చిలుకూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కనీసం 15 రోజులైనా సాగర్ నీళ్లు విడుదల చేస్తే పంటలు చేతికి వస్తాయని తెలిపారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై పట్టభద్రులకు అవగాహన

మోతె, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలో తాసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పట్టభద్రులకు బుధవారం ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తాసీల్దార్ సంఘమిత్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న 29 గ్రామ పంచాయతీలకు అర్హులైన ఎమ్మెల్సీ పట్టభద్రులకు ఎన్నికలపై అవగాహన కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. పట్టభద్రులు అవగాహన సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్పీ మోతె మండలాధ్యక్షుడిగా ఉపేందర్

మోతె, ఫిబ్రవరి 27 : బీఎస్పీ మోతె మండలాధ్యక్షుడిగా మేకల ఉపేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండ భీమయ్యగౌడ్ మంగళవారం మండలంలోని నాగయ్యగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పాతకోట్ల శ్రీనివాస్, నియోజక వర్గ అధ్యక్షుడు మాతంగి యేసుబాబు పాల్గొన్నారు.

పెద్దిన్ చెరువులో సాగునీరు దుర్వినియోగం

నాగారం, ఫిబ్రవరి 27 : మండల పరిధిలోని వర్ధమానుకోట శివారులో ఉన్న పెద్దిన్ చెరువులోని సాగునీటిని చేపల కాంట్రాక్టర్ దుర్వినియోగం చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో తన అనుచరులతో తూము నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. సాగు నీరు వృథా అవుతుండడంతో చేతికి అందివస్తున్న పంటలు ఏమైపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి దుర్వినియోగంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్ స్టేషన్లలో ఫిర్యాదుల రిజిస్టర్ ఏర్పాటు

- ఏడీ వినోద్‌కుమార్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ వినోద్‌కుమార్

మునగాల, ఫిబ్రవరి 27 : మునగాల సబ్ డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్లలో ఫిర్యాదుల నమోదు రిజిస్టర్‌ను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఏడీ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం సబ్ డివిజన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని మునగాల 9491065779, రేపాల 9491065780, తిమ్మారెడ్డిగూడెం 8333904575, ఆకుపాముల 9491065782, నేలమర్రి 8333904573 సబ్‌స్టేషన్ల నందు సెల్‌ఫోన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే ఆయా నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. డివిజన్ పరిధిలో వ్యవసాయానికి నిరంతరంగా 21 గంటలు విద్యుత్ ప్రసారం కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో ఏఈ వికాస్, సబ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

గుడుగుంట్లపాలెంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గుడుగుంట్లపాలెంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ గోపాల్, ఎంపీటీసీ వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి

పాలకవీడు, ఫిబ్రవరి 27 : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గోపాల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎన్ ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు మోతీలాల్‌నాయక్, మునగాల భాస్కర్‌రెడ్డి, బొగాల చంద్రారెడ్డి, రామాజున రెడ్డి, దిద్దకుంట్ల రమేశ్‌రెడ్డి, మునుగోటి మధు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్నమాదిగ

ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ తెలంగాణతోనే సాధ్యం

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్నమాదిగ

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 27 : ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ తెలంగాణతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్నమాదిగ అన్నారు. మంగళవారం స్థానిక పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మాదిగ ఉప కులాల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గత పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మాదిగలను మోసం చేసిందన్నారు. అందుకు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడమే లక్ష్యంగా మాదిగలమంతా ఏకమై పని చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా పనిచేస్తూ మాదిగల హక్కులు సాధించడంలో, సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మార్పీఎస్ తెలంగాణ ముందుంటుందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లేటి లక్ష్మణ్‌మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు, మేడి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకు జానయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెండ్ ముక్కంటి, కాటమయ్య, వెంకన్న, విజయ భాస్కర్, పట్టణ అధ్యక్షుడు కనుకు ప్రశాంత్, నాయకులు రాములక్క, ఏర్పుల చిన్ని, మహేశ్, దుబ్బ రమేశ్ పాల్గొన్నారు.

మఠంపల్లి లోకల్ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

మఠంపల్లి, ఫిబ్రవరి 27 : మఠంపల్లి లోకల్ ఆటో యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కందుల బాలరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మెస్సీ, ప్రధాన కార్యదర్శిగా బి.గురువయ్య, కార్యదర్శిగా వి.నాగులు, కోశాధికారిగా కె.నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా బి.వెంకటేశ్వర్లు, జి.మట్టయ్య, ఆర్.దావీదు, జనార్దన్, బాలాజీ, శంకర్, తిరుపయ్య, నాగేంద్రబాబు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వమే ఆదుకోవాలని పేర్కొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

నడిగూడెం, ఫిబ్రవరి 27 : ప్రకృతి వ్యవసాయం మనందరి బాధ్యత అని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లపురం, సిరిపురం, నారాయణపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూసారం పెరగాలంటే పశువుల పేడ, జీవామృతం, ఘన జీవామృతంను ఉపయోగించాలన్నారు. చీడ పీడల నివారణకు నీమాస్త్రం, వేప గింజల కాశాయం, బ్రహ్మాస్త్రం, ఆవు మూత్రం, పేడ ఇంగువ ద్రావణం, తుటికాడ, వావిలాకు, పుల్లటి మజ్జిగ లాంటి ద్రావణాలు వాడాలని సూచించారు. ప్రతి రైతు తనకున్న వ్యవసాయ భూమిలో అర ఎకరంలో రసాయన మందులను వాడకుండా అందుబాటులో ఉన్న సహజ వనరులతో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు.

దేవతామూర్తుల ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు గోవిందరావు

లక్ష్మితిరుపతమ్మ గోపయ్య ఊరేగింపు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 27 : మండలంలోని చీదెళ్ల లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చెట్లముకుందాపురంలో దేవతామూర్తుల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా చీదెళ్లలో నల్లబోలు లక్ష్మారెడ్డి, ఆయన కుమారులు చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం నల్లబోలు కుటుంబీకులు భక్తులకు అన్నాదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండమీద గోవిందరావు, మాజీ సర్పంచ్ రాయిరాల శోభ, అనంతుల సతీశ్, పొనుగోటి నరేందర్, కృష్ణమూర్తి, గోపాల కృష్ణ, మోదాల గోపి, కట్టెల విజయ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

చందుపట్లలో ఉపాధి హామీ పనుల పరిశీలన

మద్దిరాల, ఫిబ్రవరి 27 : మండలంలోని చందుపట్ల గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, అంతర్గత పనులను ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలతో పనులు జరుగుతున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను, గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెజ్జెంకి శ్రీరాంరెడ్డి, ఎంపీఓ రాజేశ్, ప్రత్యేక అధికారి అశిఫాబేగం, ఏపీఓ వెంకన్న, కార్యదర్శి తరుణ్, ఫీల్డ్ సభ్యుడు మధు పాల్గొన్నారు.

గరిడేపల్లి : తుంబాయిగడ్డ మండల ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల ప్రాథమిక పాఠశాలలో

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 27 : నేరేడుచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా అలరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం బట్టు మధు, హెచ్ఎం ఒగ్గు రమేశ్, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, విజయ, భూదేవి, ఫాతిమా, శ్రీను పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని తుంబాయిగడ్డ ప్రాంతంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలనా దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం ఆర్.మానస, ఉపాధ్యాయులు బి.స్వర్ణలత, ఆర్.రామకృష్ణ, సీఆర్పీ ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ సైదులు

సోమప్ప జాతరను విజయవంతం చేయాలి

- తాసీల్దార్ సైదులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 27 : మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధిలో గల పురాతణ సోమప్ప సోమేశ్వర ఆలయం వద్ద మార్చి 7 నుంచి 11 వరకు నిర్వహించే జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తాసీల్దార్ సైదులు అన్నారు. మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై అధికారులు, ఆలయ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్యూలైన్లు, ఎండ నుంచి ఉప శమనం కోసం టెంట్లు, తాగునీటి, పార్కింగ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ అధికారి మృత్యుంజయశాస్త్రీ, నాయబ్ తాసీల్దార్ మౌనిక, ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఆర్.ఐ నర్సయ్య, సోమప్ప ఆలయ పూజారి శ్రీనివాసశాస్త్రీ, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న హెచ్ఎం పద్మ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- హెచ్ఎం పద్మ

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 27 : విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ, జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం గోలి పద్మ అన్నారు. ట్రైబల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ నల్లగొండ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం సూర్యాపేట, నల్లగొండ సహకారంతో స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం బాలుర కబడ్డీలో ప్రథమ సూర్యాపేట జడ్పీహెచ్ఎస్, ద్వితీయ ఫ్రెండ్స్ యూత్ క్లబ్, బాలికల కబడ్డీలో ప్రథమ జడ్పీహెచ్ఎస్ సూర్యాపేట, బాలుర రన్నింగ్‌లో ప్రథమ సాయి రాకేశ్, ద్వితీయ దుర్గాప్రసాద్, బాలికల విభాగంలో ప్రథమ సాయిప్రియ, ద్వితీయ గాయత్రి గెలుపొందగా బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరాం, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సునీత, మంజుల, అరుణభారతి పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

తుంగతుర్తి, ఫిబ్రవరి 27 : కుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడ్డ ఘటనల మండలంలోని కాశితండాలో మంగళవారం జరిగింది. కాశితండాకు చెందిన షేక్ సలీం కుమార్తె షేక్ మఫీజా పాఠశాల నుంచి వచ్చి ఆరుబయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- ఇన్‌చార్జి హెచ్ఎం అశోక్

నూతనకల్, ఫిబ్రవరి 27 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని ఇన్‌చార్జి హెచ్ఎం దోరెపల్లి అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లసింగారం జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ సహకారంతో స్టడీ మెటీరియల్, పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జటంగి గణేశ్, ఎంపీటీసీ తండు రేణుక, పసుల అశోక్‌యాదవ్, తండు సత్యానారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళకు విశేష స్పందన

నూతనకల్, ఫిబ్రవరి 27 : ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 16 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 9 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.